క్లుప్తంగా

వీధిలైట్లు ఏర్పాటు



వీధిలైట్ వేయిస్తున్న సర్పంచు చల్లా కరుణాకర్‌నాయుడు

బత్తలపల్లి: దంపెట్ల పంచాయతీలో సర్పంచు చల్లా కరుణాకర్‌నాయుడు వీధిలైట్లు వేయించారు. దంపెట్ల పంచాయతీ పరిధిలోని గ్రామాల్లో రాత్రి వేళల్లో ప్రజలు ఇబ్బందులు పడుతున్నట్లు ఆయన దృష్టికి తీసుకురావడంతో పంచాయతీలో నిధులు లేకపోయినా సొంత ఖర్చులతో వీధిలైట్లు ఏర్పాటు చేయించినట్లు సర్పంచ్ తెలిపారు.

ఘనంగా గౌరి పౌర్ణమి వేడుకలు



భక్తులకు అన్నదానం చేస్తున్న దృశ్యం

ధర్మవరం అర్బన్: పట్టణంలోని మార్కెట్ యార్డు సమీపంలోనున్న శివభగవాన్ రమణ మహర్షి ఆశ్రమంలో మంగళవారం గౌరి పౌర్ణమి వేడుకలను రమణ మహర్షి ట్రస్టు వ్యవస్థాపకులు చిప్పల వెంకప్ప ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. గోమాతకు ప్రత్యేక పూజలు చేసిన అనంతరం రమణ మహర్షి చిత్రపటానికి పూజలు చేశారు. మహిళలు అక్షరమణిమాల పారాయణం చేశారు. అనంతరం వందలాది మందికి అన్నదానం చేశారు.

సత్యసాయి శత జయంతికి తెలంగాణ సీఎంకు ఆహ్వానం



సీఎం రేవంత్ రెడ్డిని ఆహ్వానిస్తున్న ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ రత్నాకర్‌రాజు


ప్రశాంతి నిలయం: ఈ ఏడాది నవంబర్‌లో జరిగే సత్యసాయి శత జయంతి వేడుకకు తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ ఆహ్వానించింది. మంగళవారం హైదరాబాద్‌లోని ముఖ్యమంత్రి కార్యాలయంలో సీఎం రేవంత్ రెడ్డిని సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ ఆర్‌జె. రత్నాకర్ రాజు కలిసి ఆహ్వానించారు.

ఘనంగా లక్ష్మీ చెన్నకేశవ స్వామి గరుడసేవ



ధర్మవరం అర్బన్: పట్టణంలోని లక్ష్మీ చెన్నకేశవస్వామి ఆలయంలో మంగళవారం పౌర్ణమి గరుడసేవను నిర్వహించారు. స్వామిని గరుడ వాహనంలో కొలువుదీర్చి పురవీధుల్లో ఊరేగించారు. అర్చకులు స్వామికి ప్రత్యేక పూజలు చేపట్టారు. భక్తులు పెద్ద ఎత్తున ఆలయానికి చేరుకుని స్వామిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో ఆలయ అడహాక్ కమిటీ చైర్మన్ చెన్నంశెట్టి జగదీశ్వరప్రసాద్, ఆలయ ఈఓ వెంకటేషులు, భక్తులు పాల్గొన్నారు.

గణతంత్ర వేడుకలకు 'మంగళకర' విద్యార్థి



ప్రణవ్

పుట్టపర్తి అర్బన్: వచ్చే ఏడాది హైదరాబాద్‌లో జరగనున్న గణతంత్ర వేడుకలకు జగరాజుపల్లి వద్దనున్న మంగళకర ఎడ్యుకేషనల్ ట్రస్ట్ విద్యార్థి ఎంపికైనట్లు విద్యాసంస్థల చైర్మన్ సురేష్‌కుమార్ మంగళవారం తెలిపారు. ఇందులో భాగంగా 9వ తరగతి విద్యార్థి కే.ప్రణవ్ ఈనెల 8 నుంచి 17 వరకూ జరగనున్న ఇంటర్ కం బెటాలియన్ కాంపిటీషన్స్‌కు ఉమ్మడి అనంతపురం జిల్లా నుంచి హాజరవుతాడన్నారు. ఈసందర్భంగా ప్రిన్సిపాల్ బిందుజ, ఏఎన్‌ఓ మహమ్మద్ ముదస్సార్ తదితరులు అభినందించారు.

వికసించిన బ్రహ్మకమలాలు



వికసించిన బ్రహ్మకమలాలు

పుట్టపర్తి అర్బన్: ప్రశాంతిగ్రామంలోని ఓ ఇంటిలో బ్రహ్మకమలాలు వికసించాయి. గ్రామంలోని భాస్కర్‌రెడ్డి ఇంట్లో గతేడాది నాటిన మొక్కకు ఏకంగా 19 కమలాలు వికసించాయి. దీంతో కుటుంబ సభ్యులు పెద్ద ఎత్తున పూజలు నిర్వహించారు.

అందుబాటులో లేని సంజీవని



ఈ చిత్రంలో కనిపిస్తున్న వ్యక్తి పేరు ఉసేన్‌పీరా. ఇతడిది మండలంలోని ఎగువపేట గ్రామం. క్షయతో బాధపడుతున్న ఇతడికి ఈనెల 3న రాత్రి ఉన్నఫలంగా శ్వాస తీసుకోవడం ఇబ్బందిగా మారింది. దీంతో కుటుంబ సభ్యులు వెంటనే 108 వాహనానికి ఫోన్ చేశారు. మండలంలో వాహనం లేదని గాండ్లపెంట నుంచి వస్తుందని గంట సమయం పడుతుందని చెప్పారు. ఆర్థిక స్థోమత లేని ఇతను గంటపాటు ప్రాణాలు బిగపట్టి వేచి ఉన్నాడు. తర్వాత బతుకుజీవుడా అంటూ కదిరి ఏరియా ఆస్పత్రికి చేరుకున్నాడు.

- మూలనపడిన 108 వాహనం
- ప్రత్యామ్నాయం చూపని ప్రభుత్వం
- బాధితులకు తప్పని అవస్థలు



ఆసుపత్రిలో మూలన పడిన 108 వాహనం

తలుపుల : ఆపత్కాలంలో సంజీవనిగా పేరుగాంచిన 108 వాహన సేవలు మండల ప్రజలకు అందుబాటులో లేకుండా పోయాయి. దీంతో బాధితులు అత్యవసర సమయాల్లో ఏం చేయాలో దిక్కుతోచనిస్థితిని ఎదుర్కొంటున్నారు. దాదాపు 25 రోజులుగా 108 వాహనంలో అందుబాటులో లేకపోయినా కూటమి ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదు. దీంతో అత్యవసర సమయాల్లో ప్రజల ప్రాణాలకు భద్రత లేని పరిస్థితి నెలకొంది.

ఎటు చూసినా 50 కి.మీ దూరం..

మండలంలో 43 వేల పైబడి జనాభా ఉంది. ఎక్కడ ప్రమాదం జరిగినా ఇటు కదిరి ఏరియా ఆసుపత్రికి గానీ, పులివెందుల ఏరియా ఆసుపత్రికి గానీ వెళ్లాలంటే దాదాపు 50 కి.మీ దూరం వెళ్లాల్సి ఉంది. ఇలాంటి పరిస్థితుల్లో ఉన్న ఒక్క 108 వాహనంలో దాదాపు 25 రోజులుగా అందుబాటులో లేదు. వాహనం పని చేయకపోవడంతో స్థానిక ప్రభుత్వాస్పత్రిలో మూలన పడేశారు. మండలంలో దాదాపు 50 మంది గర్భిణులు ఉన్నారు. అలాగే వర్షాకాలం కావడంతో విషపురుగుల కాట్లు ఎక్కువగా జరుగుతున్నాయి. ఇక రోడ్డు ప్రమాద ఘటనలు సరేసరి. అత్యవసర పరిస్థితుల్లో 108 వాహనం లేకపోవడంతో మండల ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం వెంటనే 108 వాహనాన్ని ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

వైఎస్సార్‌సీపీ హయాంలోనే అభివృద్ధి

- కూటమి నేతల విమర్శలను ఖండించిన వైఎస్సార్‌సీపీ నాయకులు



చెన్నేకొత్తపల్లిలో విలేకరులతో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

చెన్నేకొత్తపల్లి: వైఎస్సార్‌సీపీ హయాంలో ఎటువంటి అభివృద్ధీ జరగలేదని అధికార పార్టీ నాయకులు చేస్తున్న విమర్శలను వైఎస్సార్‌సీపీ నాయకులు ఖండించారు. నాడు గ్రామస్థాయి నుంచే అభివృద్ధి కార్యక్రమాలు జరిగాయని, అర్హులకు సంక్షేమ ఫలాలు అందాయని స్పష్టం చేశారు. వైఎస్సార్‌సీపీ పార్టీ మండల కన్వీనర్ డోలా రామచంద్రారెడ్డి, నాయకులు పవన్‌కుమార్‌రెడ్డి, ప్రకాష్‌రెడ్డి, ఎస్టీడీ శ్రీనివాసరెడ్డి, నారాయణస్వామి, మనేరు నరసింహులు, ఓబుళేసు, నాగరాజు, కిష్ట, భాస్కర్‌రెడ్డి తదితరులు మంగళవారం చెన్నేకొత్తపల్లిలో విలేకరులతో మాట్లాడారు. సచివాలయ - వలంటీర్ వ్యవస్థను ప్రవేశపెట్టి గాంధీజీ కలలు గన్న గ్రామ స్వరాజ్యం సాకారం చేసిన ఘనత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కిందన్నారు. గ్రామ, వార్డు సచివాలయాలు, ఆరోగ్య కేంద్రాలు, ఆర్‌బీకేలు కనిపిస్తాయన్నారు. జగన్ అంటే అభివృద్ధి అని, అభివృద్ధి అంటే జగన్ అని అన్నారు. ప్రతి గ్రామపంచాయతీ పరిధిలో దాదాపు రూ.2కోట్లతో అభివృద్ధి పనులు జరిగాయని ఇవేవీ కూటమి నేతలకు కనిపించడం లేదని మండిపడ్డారు. కులం, మతం, రాజకీయ పార్టీలకు అతీతంగా అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలను వలంటీర్ల ద్వారా ఇంటింటికీ అందించిన విషయాన్ని గుర్తు చేశారు. వైఎస్సార్‌సీపీలో గ్రామస్థాయి కార్యకర్త నుంచి నాయకులు అందరూ క్రమశిక్షణతోనే మెలుగుతూ వస్తున్నారన్నారు. అయితే అధికార టీడీపీ నాయకులు నైతిక విలువలకు తిలోదకాలిచ్చి అసభ్యకర రీతిలో మాట్లాడుతున్నారని ధ్వజమెత్తారు. ఈవీఎంల గిమ్మిక్కులతో కూటమి అధికారంలోకి వచ్చిందన్నారు. బ్యాలెట్ పేపర్ విధానంలో ఎన్నికలు నిర్వహిస్తే వైఎస్సార్‌సీపీ సత్తా తెలుస్తుందన్నారు. ప్రజాప్రతినిధిగా హుందాగా వ్యవహరించాల్సిందిపోయి మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డిపై అనుచిత వ్యాఖ్యలు చేయడం మంచిది కాదన్నారు. తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు కృష్ణాజలాలతో పేరూరు డ్యాంను నింపడంతో భూగర్భ జలాలు వృద్ధి చెంది బోర్లలో నీరు పుష్కలంగా వస్తోందన్నారు. ట్రస్ట్ ద్వారా అనేక సేవా కార్యక్రమాలు చేపట్టారని గుర్తు చేశారు.

ఘనంగా పెదయ్యస్వామి జలధి పూజ



పూజలందుకున్న ఆర్వేడుపట్నం పెదయ్య స్వామి

తాడిమర్రి: మండల కేంద్రంలో కురుబలు మంగళవారం జరిగిన ఆర్వేడు పట్నం పెదయ్యస్వామి జలధి పూజ, పెద్దమ్మ, యల్లమ్మ దేవతల సాగు మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. స్థానిక లక్ష్మీచెన్నకేశవ స్వామి ఆలయం నుంచి శివాలయం వరకు ప్రధాన రహదారిపై సాగిన స్వాముల ఊరేగింపు అంగరంగ వైభవంగా సాగింది. డప్పుల వాయిద్యాలు, మల్లయ్యల ఢమరుకం విన్యాసాలతో తాడిమర్రి వీధులు మార్మోగాయి. ఊరేగింపులో అడుగడుగునా భక్తులు కొబ్బరికాయలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. స్వాములను చూడటానికి చుట్టు పక్కల గ్రామాలతో పాటు ఉమ్మడి అనంతపురం జిల్లాలోని నలుమూలల నుంచి కురుబ కులస్తులు వేలాదిగా తరలి చ్చారు. అనంతరం శివాలయం పక్కన పరుష జరుగుతున్న ప్రదేశంలో స్వాములను కొలువుదీర్చారు. రాత్రి 11 గంటలకు అమ్మవార్లకు పంచామృత అభిషేకం, గంగపూజ తదితర పూజ అనంతరం అమ్మవార్లను గుడికి చేర్చారు. తాడిమర్రి వీధుల్లో మిఠాయిల దుకాణాలు, ఆటవస్తుల దుకాణాలు భారీగా వెలశాయి. ధర్మవరం డీఎస్పీ హేమంత్‌కుమార్ తాడిమర్రికి చేరుకుని భద్రతా ఏర్పాట్లను పరిశీలించారు. ముదిగుబ్బ రూరల్ సీఐ శ్యామ్‌రావు, ఎస్‌ఐ కృష్ణవేణి సిబ్బంది ఉన్నారు. ఇదిలా ఉండగా బుధవారం ఘటం ఊరేగింపు, యల్లమ్మ తల్లి సాగు మహోత్సవం నిర్వహిస్తామని నిర్వాహకులు తెలియజేశారు.

యాజమాన్య పద్ధతులతో అధిక దిగుబడులు

ఎన్‌పీకుంట: పంటల సాగులో యాజమాన్య పద్ధతులు పాటిస్తే అధిక దిగుబడులు సాధించవచ్చని ఉద్యానశాఖ అధికారి ప్రతాప్‌రెడ్డి, ఏఓ లోకేశ్వరరెడ్డి రైతులకు సూచించారు. మంగళవారం గోపాలపురం, వెలిచలమల గ్రామంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా రైతులు భాస్కర్‌రెడ్డి, నారాయణనాయక్ సాగుచేసిన మామిడి తోటలను వారు పరిశీలించి, చీడపీడల నియంత్రణపై అవగాహన కల్పించారు. పంటలు సాగు చేసిన ప్రతి రైతు ఈ నెల 25లోపు ఈకేవైసీ, ఈ పంట నమోదు తప్పనిసరిగా నమోదు చేసుకోవాలని సూచించారు. ఎఫ్ఈఎస్ ఫీల్డ్ కోఆర్డినేటర్ మణిసుధ, సుభాషిణి, మహేష్‌నాయక్, రైతులు పాల్గొన్నారు.

ఆశా వర్కర్ల సమస్యలు పరిష్కరించాలి



సీహెచ్‌ఓ లక్ష్మీదేవమ్మకు వినతిపత్రం సమర్పిస్తున్న దృశ్యం

కదిరి అర్బన్: ఆశా కార్యకర్తల సమస్యలు పరిష్కరించాలని మంగళవారం పట్నం ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో సిఐటీయూ ఆధ్వర్యంలో ఆశా కార్యకర్తలు సీహెచ్‌ఓ లక్ష్మీదేవమ్మకు వినతిపత్రం సమర్పించారు. వారు మాట్లాడుతూ ఆశా కార్యకర్తలకు పెండింగ్‌లో ఉన్న రెండు నెలల వేతనాలు చెల్లించాలన్నారు. ప్రభుత్వ సెలవులు, సంక్షేమ పథకాలు అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు సాంబశివ, ఆశావర్కర్స్ యూనియన్ నేతలు అంజినమ్మ, గంగులమ్మ, రమాదేవి, నాగలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

తనకల్లు: ఆశా వర్కర్ల సమస్యలను పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా కౌన్సిల్ సభ్యుడు ఒంటిద్దు వేమన్న అన్నారు. ఈ మేరకు ఆశా కార్యకర్తలతో కలసి స్థానిక ప్రభుత్వాసుపత్రిలో వైద్యాధికారులకు మంగళవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆశా కార్యకర్తలకు పనికి తగిన వేతనాన్ని అందించాలన్నారు. ఏఎన్ఎం, జీఎన్ఎంలుగా శిక్షణ పొందిన ఆశా కార్యకర్తలను శాశ్వత ఉద్యోగులుగా గుర్తించాలని డిమాండ్ చేశారు. ఆశా వర్కర్ల యూనియన్ నేత లక్ష్మీదేవి, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎస్సీ సెల్ సమావేశాన్ని జయప్రదం చేయండి



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న నాయకులు

కదిరి టౌన్: ఈనెల 10వ తేదిన హిందూపురంలో జరిగే జిల్లా స్థాయి ఎస్సీ సెల్ సమావేశాన్ని జయప్రదం చేయాలని ఎస్సీ సెల్ నాయకులు కోరారు. మంగళవారం వైఎస్సార్‌సీపీ కదిరి నియోజకవర్గ సమన్వయకర్త బీఎస్ మక్బూల్ క్యాంప్ కార్యాలయంలో ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు జి.నరసింహమూర్తి ఆధ్వర్యంలో పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమానికి ఎస్సీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు టిజెఆర్ సుధాకర్‌బాబు, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీచరణ్, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కొమ్మూరి కనకరావు, జిల్లాలోని అన్ని నియోజకవర్గ సమన్వయకర్తలు హాజరవుతారన్నారు. కదిరి నియోజకవర్గంలోని ఎస్సీ సెల్ నాయకులు, కార్యకర్తలు పెద్దసంఖ్యలో పాల్గొనాలని కోరారు. వైఎస్సార్‌సీపీ కదిరి పట్టణ అధ్యక్షుడు షేక్ బాబ్జాన్, కౌన్సిలర్ రాంప్రసాద్, నియోజకవర్గ ఎస్సీ సెల్ అధ్యక్షుడు మేకల నరసింహులు, ఎస్సీ సెల్ పట్టణ అధ్యక్షుడు చిన్న రెడ్డప్ప,రాష్ట్ర ఎస్సీ సెల్ కార్యదర్శి ధర్మవరం చౌడప్ప, నారాయణస్వామి, ఎస్సీ నాయకులు కొండయ్య, వినోద్, శ్రీనివాసులు, రామక్రిష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా శివాలయ వార్షికోత్సవం

నల్లమాడ: రాగానిపల్లిలో శివాలయంలో మంగళవారం ఆలయ మొదటి వార్షికోత్సవం ఘనంగా నిర్వహించారు. శివపార్వతులకు ప్రత్యేక పూజలు నిర్వహించి ఉత్సవ విగ్రహాలకు గ్రామోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. పెద్ద సంఖ్యలో భక్తులు శివపార్వతులను దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు.

'ముకుందా.. స్థాయి మరిచి మాట్లాడొద్దు'



విలేకర్లతో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

కనగానపల్లి: స్వప్రయోజనాల కోసం పార్టీలు మారే టీడీపీ నేత ముకుందనాయుడు తన స్థాయిని మరిచి మాట్లాడటం తగదని వైఎస్సార్‌సీపీ నాయకులు హితవు పలికారు. మండల కేంద్రం కనగానపల్లిలో మంగళవారం సాయంత్రం జెడ్పీటీసీ మారుతిప్రసాద్, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ నాగముని, మాజీ డైరక్టర్ ప్రభాకర్ తదితరులు విలేకరుల సమావేశంలో మాట్లాడారు. వైఎస్సార్‌సీపీ అండతో భార్యను ఎంపీటీసీ సభ్యురాలిగా గెలిపించుకున్న ముకుందనాయుడు అవసరం తీరిపోయిందని.. ఇప్పుడు రాప్తాడు మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డిపైనే అవాకులు చెవాకులు పేలుతున్నారని మండిపడ్డారు. పరిటాల కుటుంబంతో చేరి భూకబ్జాలు, అక్రమాలకు పాల్పడుతున్న నీకు.. నిస్వార్థంగా రాజకీయాలు చేస్తున్న ప్రకాష్‌రెడ్డిని విమర్శించే అర్హత, స్థాయి లేదన్నారు. సమావేశంలో వైఎస్సార్‌సీపీ యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు గంగుల సుధీర్‌రెడ్డి, నియోజకవర్గ కన్వీనర్ అమరనాథరెడ్డి, మండల నాయకులు లాయర్ నల్లప్ప, లక్ష్మీనారాయణరెడ్డి, రామగిరి సర్పంచ్ మీనుగ నాగారాజు, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా వాల్మీకి జయంతి వేడుకలు



బుక్కపట్నంలో వాల్మీకి జయంతి వేడుకలకు హాజరైన దుద్దుకుంట వెంకట్రామిరెడ్డి, నాయకులు



బత్తలపల్లిలో వాల్మీకి జయంతి వేడుకలు నిర్వహిస్తున్న వాల్మీకి సంఘం నేతలు



కదిరిలో వాల్మీకి విగ్రహం వద్ద పూజలు నిర్వహిస్తున్న వాల్మీకి సంఘం నాయకులు

పుట్టపర్తి: వాల్మీకి మహర్షి జయంతి వేడుకలను మంగళవారం బుక్కపట్నం వాల్మీకి ఆలయంలో ఘనంగా నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ సీనియర్ నేత దుద్దుకుంట వెంకట్రామిరెడ్డి, ఎంపీపీ శ్రీధర్‌రెడ్డి, మండల కన్వీనర్ కొత్తకోట కేశప్ప, సచివాలయాల కన్వీనర్ గోవర్దన్‌రెడ్డి తదితరులు హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి రఘు, సేల్స్ ట్యాక్స్ అధికారి రాజు, మండల బూత్ లెవల్ కన్వీనర్ పతంజలి, రవి, ఎర్ర కేశప్ప, అగ్రహారం బాబు, నీలూరి ఈశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

తనకల్లు: కొక్కంటిక్రాస్‌లో రాష్ట్ర వాల్మీకి సేవా సంఘం ఆధ్వర్యంలో మంగళవారం వాల్మీకి జయంతిని ఘనంగా నిర్వహించారు. వాల్మీకి సేవా సంఘం నాయ కులు మల్లెం అశోక్, నాయకులు శంకర్, రమణ, మధు, అమర్, రమణ, పుల మహేష్, బాలాజీ, ఆంజనేయులు, కిష్టప్ప తదితరులు పాల్గొన్నారు.

గాండ్లపెంట: స్థానిక గంగాభవానీ ఆలయంలో వాల్మీకి సంఘం నాయకుల ఆధ్వర్యంలో మంగళవారం వాల్మీకి జయంతి నిర్వహించారు. పంచాయతీ కార్యదర్శి మూర్తి, వాల్మీకి సంఘం నాయకులె ఆనంద్, శివప్రసాద్, టైలర్ బయన్న, శివ, నరసింహులు, ఆంజనేయులు, గోపి, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

తలుపుల: పులిగుండ్లపల్లితోపాటు తహసీల్దార్ కార్యాలయంలో మంగళవారం వాల్మీకి జయంతి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు తహసీల్దార్ రెడ్డిశేఖర్, వాల్మీకి సంఘం నాయకులు పాల్గొన్నారు.

నల్లచెరువు: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ జమానుల్లా ఖాన్ ఆధ్వర్యంలో వాల్మీకి జయంతిని మంగళవారం ఘనంగా నిర్వహించారు. డీటీ రవి నాయక్, ఆర్ఐ లక్ష్మీదేవి, సిబ్బంది పాల్గొన్నారు.

కదిరి టౌన్: కుటాగుళ్లలోని వాల్మీకి మహర్షి విగ్రహం వద్ద వాల్మీకి సంఘం నాయకులు మంగళవారం వాల్మీకి జయంతి వేడుకలు నిర్వహించారు. నాయకులు గంగరాజు, శంకర, నరసింహులు, చంద్ర,తదితరులు పాల్గొన్నారు.

ధర్మవరం రూరల్: ఏలుకుంట్ల, గొట్లూరు, దర్శనమల తదితర గ్రామాల్లో మంగళవారం వాల్మీకి జయంతి వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా వాల్మీకులు అన్నదానం చేపట్టారు.

తాడిమర్రి: వాల్మీకి జయంతిని పురస్కరించుకుని మంగళవారం వాల్మీకులు మహర్షి వాల్మీకి చిత్రపటాన్ని ఊరేగించారు. బోయ సంఘం మండలాధ్యక్షులు చింతకాలయ రెడ్డెప్ప, అంకే నారాయణస్వామి, కునుకుంట్ల రాజా, ఓబిలేసు, నిడిగల్లు ప్రసాద్, చిల్లకొండయ్యపల్లి శ్రీనివాసులు పాల్గొన్నారు.

బత్తలపల్లి: మండల కేంద్రంతోపాటు ఈదుల ముష్టూరు, అప్పరాచెరువు, రాఘవంపల్లి, మాల్యవంతం, ఉప్పర్లపల్లి, దంపెట్ల, పోట్లమర్రిలో వాల్మీకులు వాల్మీకి జయంతి వేడుకలను నిర్వహించారు. ఎంపీడీఓ నరసింహనాయుడు, డిప్యూటీ ఎంపీడీఓ క్రిష్టప్ప, వాల్మీకి సంఘం రాయలసీమ ఇన్‌చార్జ్ బోయ సాంబశివ, , వైఎస్సార్‌సీపీ బీసీ సెల్ మండల అధ్యక్షులు మందల నరసింహుడు, నాగభూషణ, సుబ్బరాయుడు, ముసలప్ప, హరి, రమణ, వీరప్ప, ముఖేష్, సతీష్, సురేష్, రాజు, నరేష్, విజయ్, నాగ, గోపాల్, ఓబులేసు, నరసింహుడు, నారాయణస్వామి, శివ, తిక్కయ్య, వాల్మీకి సోదరులు పాల్గొన్నారు.

ముదిగుబ్బ: మండల కేంద్రంలో మంగళవారం మహర్షి వాల్మీకి జయంతి వేడుకలను వాల్మీకులు ఘనంగా జరుపుకున్నారు. వాల్మీకులు బాలచంద్ర, హరి, రామాంజి తదితరులు పాల్గొన్నారు.

కొత్తచెరువు: కొత్తచెరువులోని వాల్మీకి విగ్రహం వాల్మీకి జయంతిని ఘనంగా నిర్వహించారు. వాల్మీకి సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాదయాత్ర శంకర్, వైఎస్సార్‌సీపీ మాజీ టౌన్ కన్వీనర్, ఎంపీటీసీ ఆవుల రాము, స్కూల్ కమిటీ మాజీ చైర్మన్ సుమో కృష్ణమూర్తి, కొత్తచెరువు వాల్మీకి మండల కన్వీనర్ బోయ మారుతి, చింతకాయల క్రిష్టప్ప, బండ్ల పల్లి గోపాల, శాంపురం ఆంజనేయులు, చింతకాయతల శ్రీరాములు, టైలర్ నాగరాజు, నీరుగంటి చిరంజీవి, లక్కీ శివా, శాంపురం వెంకటేష్, బోయ దుర్గ పాల్గొన్నారు.

నల్లమాడ: మహర్షి వాల్మీకి జయంతిని మంగళవారం మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించారు. ఎంపీడీఓ శ్రీనివాసులు, ఎంఈఓ వేమనారాయణ, ఏపీఓ రఘునాథరెడ్డి, సర్పంచ్‌లు ప్రమీలమ్మ, బొజ్జే నాయక్ పాల్గొన్నారు.

కనగానపల్లి: కనగానపల్లితో పాటు పలుచోట్ల మంగళవారం వాల్మీకి మహర్షి జయంతి ఘనంగా నిర్వహించారు. వాల్మీకి సంఘం నాయకులు, యూత్ నాయకులు, స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

రామగిరి: పేరూరులో మంగళవారం వాల్మీకి మహర్షి జయంతి సందర్భంగా మహిళలు బోనాలను మోసుకొచ్చి సమర్పించారు. అనంతరం గ్రామంలో వాల్మీకి చిత్రపటాన్ని ఊరేగించి.. అన్నదానం నిర్వహించారు.

చెన్నేకొత్తపల్లి : ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీడీఓ బాలకృష్ణుడు ఆధ్వర్యంలో వాల్మీకి జయంతి నిర్వహించారు. న్యామద్దెల, మేడాపురం గ్రామాల్లో వాల్మీకి జయంతి సందర్భంగా మహిళలు జ్యోతులతో ఊరేగింపు నిర్వహించారు.

రీ సర్వే పక్కాగా చేపట్టాలి

కనగానపల్లి: భూ సమస్యలు పరిష్కరించేలా రీ సర్వే పక్కాగా చేపట్టాలని తహసీల్దార్ ప్రసాద్ రెవెన్యూ, సర్వే సిబ్బందిని ఆదేశించారు. మంగళవారం ముక్తాపురంలో రీ సర్వేలో ఫీల్డ్ సర్వే కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఆర్ఎస్ డీటీ జ్యోతి, మండల సర్వేయర్ కరుణాకర్, వీఆర్వో చెన్నేకేశవులు పాల్గొన్నారు.

వేరుశనగలో పంట కోత ప్రయోగాలు

ధర్మవరం రూరల్: కుణుతూరు గ్రామంలో మంగళవారం వేరుశనగ పంటలో పంటకోత ప్రయోగాలను చేపట్టారు. సాకే సాలమ్మ, వెంకటరామిరెడ్డి పొలాల్లో పంట కోత చేపట్టగా 25 చదరపు మీటర్ల విస్తీర్ణంలో 1450 గ్రాములు, 1320 గ్రాముల చొప్పున దిగుబడి వచ్చినట్లు ఏఎస్‌ఓ లక్ష్మీనరసింహశర్మ, ఏఓ ముస్తఫా తెలిపారు. వీహెచ్‌ఏ చరిత రైతులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి బీమా చెక్కు పంపిణీ

ముదిగుబ్బ: నాగలగుబ్బకు చెందిన శుద్ధ కిష్టప్ప ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. మంగళవారం మృతుడి భార్య అనసూయమ్మకు కెనరా బ్యాంక్ ద్వారా ప్రమాద బీమా చెక్కును (రూ.4.3 లక్షలు) కెనరా బ్యాంక్ మేనేజర్ లక్ష్మీనరసింహులు అందజేశారు. ఫీల్డ్ ఆఫీసర్ భాస్కర్‌రెడ్డి, ఇన్సూరెన్స్ కంపెనీ ప్రతినిధి పాల్గొన్నారు.

వైఎస్ జగన్‌ను కలిసిన నరేంద్రరెడ్డి



వైఎస్ జగన్‌తో నరేంద్రరెడ్డి

పుట్టపర్తి టౌన్: వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని వైఎస్సార్ విద్యార్థి విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షుడు మద్దిరెడ్డి నరేంద్రరెడ్డి మంగళవారం తాడేపల్లిలో మర్యాద పూర్వకంగా కలిశారు. విద్యార్థులు, నిరుద్యోగుల సమస్యలపై అధినేతతో చర్చించినట్లు నరేంద్రరెడ్డి తెలిపారు.

జీఎస్టీ తగ్గింపుపై అవగాహన

బత్తలపల్లి: మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం జీఎస్టీ తగ్గింపుపై అవగాహన నిర్వహించారు. ఈసందర్భంగా ఎంపీడీఓ నరసింహనాయుడు జీఎస్టీ తగ్గింపుతో కలిగే ఉపయోగాలను తెలియజేశారు. అనంతరం పురవీధుల్లో ర్యాలీ చేపట్టారు. డిప్యూటీ ఎంపీడీఓ క్రిష్టప్ప, పంచాయతీ కార్యదర్శులు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

కదిరి అర్బన్: స్థానిక ఎస్టీఎస్ఎన్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మంగళవారం జీఎస్టీపై విద్యార్థులకు చిత్రలేఖన, వ్యాసరచన పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులు అందజేశారు. కళాశాల ప్రిన్సిపాల్ డా స్మిత, అధ్యాపకులు శంకర్, హైదరాలి, చెన్నారెడ్డితో పాటు పలువురు పాల్గొన్నారు. అలాగే జెడ్పీహైస్కూల్‌లో ప్రధానోపాధ్యాయుడు భాస్కర్ ఆధ్వర్యంలో విద్యార్థులకు సూపర్ జీఎస్టీపై వ్యాసరచన పోటీలను నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు.

వన్యప్రాణుల సంరక్షణ అందరి బాధ్యత

ఎన్‌పీకుంట: అడవులు, వన్యప్రాణులను సంరక్షించుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని ఫారెస్ట్ రేంజ్ అధికారి గుర్రప్ప పేర్కొన్నారు. వన్యప్రాణుల సంరక్షణ వారోత్సవాల్లో భాగంగా మంగళవారం గూటిబైలు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు అడవులు, వన్యప్రాణుల ప్రాధాన్యతను వివరించారు. అటవీ, వన్యప్రాణుల చట్టాల పై అవగాహన కల్పించారు. అనంతరం విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించి బహుమతులు అందించారు. డీఆర్‌ఓ ప్రదీప్‌కుమార్, ఎఫ్ఎస్ఓ దామోదర్, ఎఫ్‌బీఓలు బ్రహ్మయ్య, మంజుల, రేణుక, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.